
కథానిక :

# నిష్క్రమణం



శ్రీ పంతుల శ్రీరామశాస్త్రి

★

హలో! ఎవరు ?

నేను నీలకంఠంగారి నౌఖర్నమ్మా కూర్మయ్యని నువ్వేనా ? నీలకంఠంగారున్నారా ?

ఉన్నారమ్మా! ఇప్పుడే భోజనానికి కూర్చోబోతున్నారు.

భోజనానికా ? ఏమిటి, నిజమే? వారి నొక్కమారిలాగ రమ్మనగలవా ?

చిత్తం! చెప్తానమ్మా!

బాబూ! నిర్మలమ్మగారు తమర్ని ఒక్కమారు ఫోను దగ్గరికి రమ్మంటున్నారు.

ఓరిఘాలు! ఎవరు పిల్చినా నేను లేనని చెప్పమన లేదురా ?

ఏమో బాబూ! మరెవరితోనయినా అలా చెప్పాలనుకొన్నాను. నిర్మలమ్మగారితో లేరంటే ఏమంటారోనని...

నీ స్వంత తెలివితేటలు కొంత వెలిగించేవు. నిర్మల ఎక్కువేమిటి ? అందరిలాటి మనిషేకదూ ?

అదేటిబాబూ! అలా అంటారు. ఆరిని తెలిసిన కాడినుంచి ఈ పదినెల్లలోనూ ఒక పదిరోజులయినా ఇక్కడ భోంచేశారా? ఆయమ్మ పిలిస్తే, తమరు లేరంటే ఏమంటారోనని భయపడ్డాను బాబూ! తమరితో తప్పకుండా మాట్లాడాలిట!

ఏడిసినట్టున్నాయి తెలివి తేటలు! ఏమని చెప్పావు. ఇంట్లో నేనున్నాననేనా ? అందులోనూ ఒక్కణ్ణే ఉన్నాననా ?

అదేటీ నేదు బాబూ! తమరున్నారు; భోజనానికి కూర్చుంటున్నారని చెప్పేను.

మా గొప్పపని చేసేవు, ఆవిడకి మరీ కోపం రావడానికి. సరే, మరి తప్పదు.

హలో !

ఎవరు శ్రీమాన్ నీలకంఠంగారే? ఆహా! ఇవతల నాకీ రిసీవరు పట్టుకొనిఉండగానే నిద్రవచ్చేట్ల యింది. పోనీ ఇప్పటికయినా తెమిలేరు.

క్షమించాలి. ఆలస్యం అయింది. అందులో మా కూర్మయ్య సంగతి మీకు తెలియదా ? అసలిందాకా నేను మీ యింటికి రావాలని బట్టలు వేసుకొన్నాను. అంతలో సరిగ్గా...

ఏమయిందేమిటి ?

ఏమీ లేదు. మా చిన్ననాటి స్నేహితుడొకడు, అమాంతంగా వచ్చిపడ్డాడు.

ఓస్ అంతేనా ? మరేమీ ప్రళయం కాదన్న మాట ?

కాదుగాని, వాడు నాఅతిథి చూడండి; వాడికి భోజనభాజనాదులు సమకూర్చాలి. వాడికి మళ్ళీ పని

ఉండటు. ఈ రాత్రి పన్నెండుగంటల బండీకి వెళ్ళిపోతానంటున్నాడు.

అయితేనేం, ఇద్దరూ కలిసి, ఇక్కడికి వచ్చేయక పోయారా? నాకూ రాధాకృష్ణ లేకపోడంవల్ల ఒంటరిగా ఏమీ తోచకుండా ఉంది. అయినా మీ బ్రహ్మచారి కొంపలో అతిథిసత్కారం ఏమి బాగా సాగుతుంది? ఇప్పుడు మాత్రం మించిపోయిందేమిటి? వచ్చెయ్యండి. మీకు మా యింట్లో అభ్యంతరం అయితే ఏదయినా హోటలుకి పోదాము. అక్కడనుండి ఏదయినా సినీమాకి వెళ్ళి, తర్వాత ఆయనను రైలుకి దిగబెట్టి మనం కలిసి రావచ్చును. ఏమంటారు?

బాగానే ఉంటుంది కాని...

మరి కాని ఏమీలేదు. అంతే. ఇప్పుడే కారు పంపిస్తాను. మీరు రండి. మీరు వచ్చేలోగా నేను తయారవుతాను.

ఒక్క క్షణం ఆగండి నిర్మలాదేవి! మా వాడు చాలా మొగమాటం మనిషి. అందులోనూ స్త్రీల సముక్షంలో మరీని. ఇటీవల వాడికి వ్యాపారంలో బాగానే కలిసివచ్చిందట. కాని, ఇంటి విషయాల్లో మాత్రం, బహుకుటుంబీకుడు లెండి, చాలా అనుకోని గొడవలు వచ్చి పడ్డాయట. ఈ పన్నెండుగంటల పర్యంతం అవన్నీ నేను ఆకర్ణించి సానుభూతి ఒలకబోయ్యాలి. దగ్గర లేడులెండి, మేడ మీద నా కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు.

ఎవరో చాలా చిత్రమయినవాడులాగున్నాడే. పోనీ లేకపోతే మీకాగొడవ వదిలిపోతుంది! నాకూ కాస్త కాలక్షేపంగా ఉంటుంది; నేనే తిన్నగా అక్కడికి వచ్చేద్దునా?

మీరే వస్తానంటే వద్దంటానా? కాని, చూసేరు కదూ, వాడికి తన మనసుని పీడిస్తున్న సంగతులన్నీ ఏకరువుపెడితేనేగాని తృప్తిలేదు. ఇప్పుడుగాని, అందుకు సరిఅయిన అవకాశం దొరకలేదంటే రేపంతా ఉండి వేధిస్తాడు. అంతకంటె వాడు ఇందాకా కాస్త మొగమాటపడినట్లుగా అన్నాడు, ఇప్పుడు తొమ్మిదిగంటల పాసెంజరులోనే వీలయితే వెళ్తానని. వాడుగాని, కదిల్తే, వదిల్తే, నేను తొమ్మిదిన్నరకల్లా మీ యింటికి వస్తాను. మనం కలిసి సినీమాకి వెళ్దాము.

తప్పకుండా వస్తారు కదూ?

శాయశక్తులా ప్రయత్నిస్తాను.

లేకపోతే తొమ్మిదిన్నరకి నేనే వద్దునా?

ఎందుకు మీకు శ్రమ? వాడు కదిల్తే, తిన్నగా స్టేషనునుండి నేనే వస్తాను. కదలకపోతే, ఆ గొడవలో మీకుకూడా ఎందుకు తలనొప్పి?

నాకిప్పుడే తలనొప్పి వచ్చేట్లుంది. తొమ్మిదిన్నరకల్లా మీరు రాకపోతే, మీ యింటికి తిన్నగా వస్తాను. అతని గొడవలు వింటూంటేనయినా నా తలనొప్పి తగ్గుతుందేమో?

అరరె! తలనొప్పిగా ఉందా? ఎలాగయినా నిద్ర తెప్పించుకోండికి ప్రయత్నించండి. నేను తప్పకుండా వస్తాను. వచ్చేసరికి మీరుగాని నిద్రపోతూ ఉంటే మాత్రం మరి లేపను లెండి-మరి శలవా?

తప్పకుండా వస్తారు కదూ? అతను ఎప్పుడు వెళ్ళిపోయినా సరే! మేడమీద నా గదిలో లైటు వెలుగుతూండంటే నేను మేలు కొని ఉన్నట్టే లెక్క.

అలాగే. తప్పకుండాను. వీలయినంతమట్టుకు నిద్ర తెప్పించుకొనే ప్రయత్నం చెయ్యండి.

—అమ్మయ్యా! కూర్మయ్యా! ఇప్పటికి బ్రతికి బయటపడ్డాను.

ఏటో బాబూ! తమరి సంగతంతా సిత్రంగా ఉంది.

చిత్రమా, మరీచిత్రమా? ఇదంతా ఎందువల్ల వచ్చి పడిందో తెలుసునా?

ఒక్క మాట నువ్వు సరిగ్గా ఇంటిదగ్గర లేరని ఉంటే ఇంత గొడవ లేకపోయేది కదా!

ఏటో బాబూ! నాకేటీ తెలవకుండా ఉంది.

నీకు బోధపడేసరికి రోజున్నర పడుతుందిలే. పోనీ, అలాగని చెప్పినపని చెప్పినట్టు చెయ్యవు, నీ పైత్యంకూడా కొంత జతచేస్తేనేగాని నీకు తృప్తి కలగదు. నీ తెలివితక్కువ - కాదు అతి తెలివిమూలంగా, ఇప్పుడు లేని స్నేహితుణ్ణొకణ్ణి సృష్టి చేసుకోవలసి వచ్చింది. వాడయినా ఎంత వరకు అడ్డు నిలబడగలడో అనుమానమే. ఆవిడ కారు వేసుకొని ఏ నిమిషంవచ్చినా రావచ్చును.

ఒస్తే ఏటి భయంబాబూ అబద్ధానికి తయారయినాక, స్నేహితుడుగారు ఇప్పుడే ఎల్లిపోయినారంటారు.

ఏడిసినట్టే ఉన్నాయి వెధవ తెలితేటలు. ఏదిపనీ నీకు చెప్పినట్టుగా చెయ్యవు. ఆవిడ వచ్చిందంటే లాభంలేదు, ఉహూ! ఆవిడ రావడానికివీల్లేదు. వెళ్తే

నేనే వెళ్తాను. సరే, కాని, భోజనాని కేమున్నాయి, ఆ పేర్చిన వస్తువులేనా? వారంరోజులుగా పస్తుపడుకొన్న వాడికయినా అవిచూస్తే మరి తినాలని బుద్ధి పుట్టదు.

తమరికి తెలవనిదేటుంది బాబూ! అయినా తమరీ మద్దినల్లా ఇంటికాడ భోంచెయ్యడమే లేదు. ఆరింటికాడో, హోటేల్లోనో తప్ప - మద్ధాన్నం కూసింత సెప్పేసి ఉంటే...

అవునవును, సకాలంలో అంటే వారంరోజులు ముందుగా నీతో విన్నవించుకోవాలి. లేకపోతే వెధవయింట్లో తిండికయినా గతిలేదు. మరి లాభం లేదు కూర్మయ్యా! నువ్వు బాగా ముసలివాడివయి పోయేవు. రేపటినుంచీ పెన్షనుతీసుకో, నేను మరొకణ్ణి పెట్టుకొంటాను.

తమరంతలా ఆగ్రహిస్తే ఏటి చెయ్యనుబాబూ! తమర్ని నా చేతుల్లో ఎత్తుకొని ఆడించేను. చదువుకెళ్ళినా, అడవులు కొండలూ ఒకటేమిటి తమరితో పాటు సముద్రంకూడా దాటేను. ఇప్పటికి తమర్ని ఒక్కరోజు విడిచిపెట్టలేదు. నాన్నగారు తమర్ని నాకప్పగించేరు. ఈ ముసలోణ్ణి ఇప్పుడు పొమ్మంటే-

నీకేం నష్టం వచ్చింది? నీ జీతం పూర్తిగా నీకు నెల నెలా వచ్చే ఏర్పాటు చేస్తానంటూ ఉంటే-నాకు ఉన్న పనులే తక్కువ. అవికాస్తా నువ్వు పుణ్యం కట్టుకొంటావు.

లేదు బాబూ! పొరపాటయిపోయింది. మరెప్పుడూ...

ఇలా అనడానికిది వెయ్యోమాటు. కాదుగాని కూర్మయ్యా, పని చెయ్యకుండా నిండుజీతం పుచ్చుకోడానికి నీకేమిటి కష్టం?

కష్టం కాదూ బాబూ! తమ నాన్నగారు నా కుటుంబానికి ఏలోటూ లేకుండా చేసేరు. నాకొడుకులంతా పెద్దవాళ్ళయి వాళ్ళ బ్రతుకులు వాళ్ళు బ్రతుకుతున్నారు. ఒక్క కూతురు. దానికికూడా భగవంతుడి దయవల్ల ఏ లోటూలేదు. నాకింకేం కావాలి? నాన్నగారు నన్ను తమర్ని ఎన్నడూ విడిచిపెట్టనని ఒట్టేసుకోమన్నారు బాబూ! తమరు జీతం ఇచ్చినా ఇయ్యక పోయినా సరే, సేవ చెయ్యనిస్తే నాకంతే చాలును. తమరు పెళ్ళి చేసుకొని, ఒక యింటివారయితే, అప్పటికి నా బరువు తగ్గుతుంది.

ఇదుగో ఇదే నీలోని దుర్గుణం. నాకు మంచి చెయ్యాలనే అనుకొంటావు. కాని, నాకు అక్కరలేని, చికాకువేసే మాటలే మాటి మాటికీ అంటూ ఉంటావు. ఇదివరకెన్నిమార్లు చెప్పాను, నా పెళ్ళిమాట ఎత్తవద్దని.

అలా అంటే ఎలా బాబూ! ఇదివరకంటే చిన్నతనం. మీరూ రాధాకృష్ణ బాబుగారిలాగ పెళ్ళిచేసుకొని, చిలకా గోరింకల్లాగుంటే...

చేసుకొందామంటే మాత్రం అందరికీ నిర్మలలాటి మనిషి దొరుకుతుందా?

ఎందుకు దొరకరు బాబూ! తమ కేటి లోటు? రూపం, డబ్బు, చదువు అన్నీ ఉన్నాయి; తమరు సరేనంటే చాలు కోకొల్లలు పెళ్ళికూతుళ్ళు-అందాల భరిణలు, బంగార బొమ్మలు...

ఊఁ చాల్లే చాలించు కవిత్వం. అందం! వట్టి అందమయితే ఏం లాభం? అంతకంటె ప్రాణంలేని చిత్రాలు శిల్పాలు వెయ్యిరెట్లు నయం. వట్టి అందమే కాదు, అందుకు విలక్షణమయిన ఆకర్షణ...సర్లే,నీతో ఏం మాట్లాడి ఏం లాభం? నీకు చెప్పేది ఒక్కటే మాట—నీ ఉద్యోగం బర్తరఫు కాకుండా ఉండాలంటే, ఈ మారెప్పుడూ నా పెళ్ళిమాట ఎత్తకు! మరి తిండిమాట ఏమంటావు?

తమ సెలవయితే, ఏవి తెమ్మంటే అవి నిమిట్లమీద తెచ్చేస్తాను.

నీ మొహం తెచ్చేవుగాని, నే చెప్పేది ఒకటి నువ్వు తెచ్చేది మరొకటి. అంతకంటె నేనే పోవడం మేలు. నే వెళ్తున్నానుగాని, చెప్పింది కాస్త కునికిపాట్లు పడకుండా విను. నేను వచ్చేలోగా నిర్మలాదేవిగాని వస్తే, నేనూ మా స్నేహితుడూ కలిసి భోంచేసి ఎక్కడికో వెళ్ళేమని చెప్పాలి. రైలు స్టేషనుకో ఎక్కడికో నీకేమీ తెలియదు. మురుగుల కథలాగ మాత్రం చెయ్యకు, ఫోనులో పిలిచినా అంతే-

చిత్తంబాబూ. తమరొచ్చి, నిద్రపోయినాక, ఒకమారు మా వాళ్ళింటికెళ్ళి వస్తాను.

నీకు కావాలంటే ఇప్పుడే వెళ్ళు. నా తాళం నా పర్సులోనే ఉందికదూ. నా పక్క అదీ వేసి, రాసుకొనేవస్తువులూ అవీ టేబిలుమీద ఉంచి, నీ యిష్టం ఎప్పుడు వెళ్ళినా సరే...

తమరికి నిద్రపట్టదంటున్నారు. ఏ మవసరం పడుతుందో, నేను పొద్దున్నే వెళ్తాను బాబూ!

సరేగాని, ఆవిడ వచ్చినా ఫోనులో పిలిచినా ఏమిటి చెప్పాలో జ్ఞాపకం ఉండికదూ.

చిత్తంబాబూ! మరి మరిచి పోతానా?

ఏమోన్లే, మళ్ళీ నీ స్వంతకవిత్వం వెలిగించి పొరపాటయిపోయింది బాబూ అని మాత్రం అంటే ఊరుకొనేదిలేదు.

పెద్ద హోటలు. అందులో ప్రత్యేకమయిన గది. వెయిటరు ఒక్కొక్కటి చొప్పున ప్లేట్లు తెచ్చి పెడుతూ ఉంటే ఇవన్నీ తాను ఆర్డరిచ్చినవేనా అనిపించింది. కాని చెప్పందీ వాడెందుకు తెస్తాడు.? పోనీ ఈ మారు తెచ్చే ఈ డిష్ అయినా కాస్త తినబడుతుందేమోనని చూస్తున్నాడు నీలకంఠం. కాని ఏమిటో అన్నీ ఒక్కలాగున్నాయి.

పదార్థాల రుచిలో ప్రత్యేకించి ఇది లోపము అనడానికి వీల్లేదు. ఇంతకంటె చిన్న హోటల్సులో, మంచి కుర్చీలు బల్లలూ విశ్రాంతిగా కూర్చుందికి తగిన స్థలమూ లేనిచోట్లకూడా ఎంతో తృప్తిగా తినగలిగేవాడు, పదార్థాల రుచినిగురించి ఎక్కువ పట్టింపు లేకుండా. ఇక్కడ కుర్చీలు, బల్లలు దీపాలు పంకాలు, అద్దాలు అన్నీ సక్రమంగా ఉండవలసినంత బాగానూ ఉన్నాయి. పదార్థాలు, పానీయాలూ వెయిటర్లు—ఏ అంశములోనూ లోటులేదు.

అయితే మరి ఎంచేత తాను తృప్తిగా తినలేకపోతున్నాడు? ఏదో లోటుంది. ఆలోటు బాహ్యమయిన వస్తు సముదాయంలోనూ, వాతావరణంలోనూ కాక తనలోనే ఉంది. లేకపోతే ఈ పదినెల్లలోనూ ఈ హోటల్లోనే ఈ గదిలోనే ఎన్నో మార్లు నిర్మలా రాధాకృష్ణలతో కలిసి భోంచేసేడు. అప్పుడు తన కేటువంటిలోటూ కనబడలేదు. అసలు కనబడడానికి తగిన విశ్రాంతి ఉంటే కదూ! రాధాకృష్ణ—నిర్మల—వీరి సాహచర్యం తన ఇంద్రియాల పరిశీలన జ్ఞానంలోనే ఏదో చిత్రమయిన మార్పు తెచ్చిఉండాలి.

అందరూ తన మంచినీ సుఖాన్నీ కోరేవారే. తనకి కష్టాలు కలిగించేవారే—కూర్మయ్యలాగ. వాడి తెలివితక్కువ పనులవలన అంత ప్రమాదం లేదు; కాస్త విసుగుకొని నాలుగు కేకలువేస్తే సరిపోతుంది.

కాని రాధాకృష్ణలాటివాడి స్నేహమూ అభిమానమూ ఉన్నాయే ఇవి మొదట్లో ఎంత అభిలషణీయమయిన వయినా చివరికి మరింత బాధపెట్టడానికి మాత్రమే పనికివస్తాయి.

హాయిగా స్వేచ్ఛగా ఒక పూచీ పేచీ లేకుండా దేశాటనం చేస్తూ ఎక్కడ ఎన్నాళ్ళు కావాలంటే అన్నాళ్ళు ఉంటూ, ఎప్పుడు కావాలంటే అప్పుడు బయలుదేరి పోగలిగేవాణ్ణి ఒకచోట తెచ్చి కట్టి పడేసేడు. పోనీ అంతతోనయినా ఊరుకొన్నాడా? తనతోపాటు కారులో తిప్పడం! తగిన పరిశ్రమ లేకుండా ప్రతినిత్యమూ విలువయిన పుష్టికరమయిన భోజనం చెయ్యడం! ఇప్పటి కప్పుడే ఈ పది నెలల్లోనూ బరువు పదిహేను పౌనులు ఎక్కువయింది. ఈవిధంగా బద్దకంగా మరొక ఏడాది తిని కూర్చుంటే మరి పదిహేను కాదు పాతిక పౌనులు బరువెక్కువయినా ఏమీ ఆశ్చర్యపడవలసిన అవసరంలేదు. ఇప్పుడు ఎక్కువయినది పదిహేను పౌనులే అయినా వందపౌనులు ఎక్కువయితే ఉండేపాటి స్తబ్ధత్వం వచ్చింది.

ఇదంతా రాధాకృష్ణతనకు జీవితమంటే ఆకర్షణ, అభిరుచి, ఉత్సాహమూ కలిగిస్తానని చేసిన నిరవాకమే. ఆటలూ పాటలూ విందులూ నృత్యాలు—తనకి తీర్చుకోవాలని ఉన్న సరదాలన్నీ ఇవతలిమనిషి పేరుపెట్టి తీర్చుకొనే ఎత్తుమాత్రమే.

నిజంగా రాధాకృష్ణ ద్రోహంచేసేడా? తనకు పూర్వం ఒక పూటంతా ఒక నదిఒడ్డున తిరుగుతూ ఉంటేనో, కొండ ఎక్కుతూ ఉంటేనో, వేట అనే పేరుతో అడవుల్లో సంచరిస్తూ ఉంటేనో అతి ఉల్లాసంగా గడిచిపోయేది. ఆతరవాత చల్లని మంచినీళ్లే అద్భుతమయిన పానీయంగా ఉండేవి; ఏపదార్థాలయినా అత్యంత రుచికరంగా ఉండేవి. కాస్త కంటికి అందంగా కనిపించినచోట ఆగడం, ఉండాలనిపించినన్నాళ్ళుండడమూ, ఎప్పుడు బుద్ధిపుడితే అప్పుడు బిచాణా ఎత్తివెయ్యడమూ, ఎంత హాయిగా నిర్విచారంగా ఉండేది! ఆరకమయిన సంతత చలనశీలాన్నీ సహజసిద్ధమయిన తృప్తినీ అంతరింప జేసినవాడు రాధాకృష్ణ.

ఉద్దేశించినా ఉద్దేశించకపోయినా అతడు తనకు ఇటీవల చేసిన అలవాటులు అధికవ్యయంతో కూడుకొన్నవే కాక సహజమయన ప్రకృతితో సంబంధంలేనివి. అందరూ ఏవో తప్పనిసరిఅని భావించేవి, ఎవరూ ఎక్కువగా ఆనందించని విన్నీ—విందులు—పేకాట...అసలు ఆడిన ఆటకంటె ఆటలోని పొరపాట్లనిగూర్చిన చిత్రవధే ప్రధానము.

ఛ ఛ ఛ. ఇంతటి అలసత్వానికి తా సెలా అల

వాటుపడిపోయేడు, ఇదంతా రాధాకృష్ణ బాధ్యత కాదా?

అయితే అతనేమి కట్టిపెట్టిఉంచేడా? అతను చెప్పిన పనులన్నీ ఎందుకు చెయ్యాలీ? నిజంగా ఇష్టం లేదని ఎదురుతిరిగితే అతనేం చెయ్యగలడు? లోపల్లోపల కొంత ఇష్టంఉండికూడా అతడిని నెపపెట్టడం జరుగుతూందన్నమాట. లేకపోతే ఇప్పు డింతలా మథనపడకపోతే తిన్నగా రయిలెక్కిపోరాదూ?

అయితే రైలెక్కిపోవడమే మేలు—ఎక్కడికి వెళ్ళాలి. ఏమిటి చెయ్యాలి?—ఎక్కడికయినా బాధ లేదు; ఏమీ చెయ్యకపోయినా నష్టంలేదు. ఎక్కడికో ఒకచోటికి తననుండి తనను కాపాడుకొందికి ఈరాత్రి దూరంగా పారి పోవాలి.

అదే బాగుంది, తొమ్మిదిగంటలకి ఎలాగూ స్నేహితుణ్ణి దిగబెట్టడానికి స్టేషనుకి వెళ్ళాలికదూ. ఆ వెళ్ళడం అతడి బలవంతంమీద రైలెక్కి వాళ్ళ ఊరు వెళ్ళిపోయేమన్నమాట. మళ్లీ తరవాత మూడు రోజులనాడు రామకృష్ణ వచ్చేవరకూ తిరిగి రానక్కర లేదు.

కాని రెండుమూడురోజులుండాలంటే బట్టలూ అవీ తీసుకోవాలి. డబ్బుకూడా పర్సులో పాతిక కంటె ఎక్కువ ఉండదు. ఇంకా సుమారు అరగంట పైగా టైముంది, బండీ రావడానికి. ఇంటికి వెళ్ళి కావలసినవి నాలుగూ తీసుకొనే బయలుదేరవచ్చును. కూర్మయ్యచేత రేపు ప్రొద్దున్న కబురు చెప్పించ వచ్చును, తప్పనిసరిగా వెళ్ళవలసి వచ్చిందిటఅని.

ఏంకూర్మయ్యా! నాకోసం ఎవరయినా వచ్చేరా?

లేదు బాబూ!

బ్రతికాను. సరే. మరి నేను ఇప్పుడీ రైల్లో...

బాబూ! ఆయమ్మ నిర్మలమ్మగారు ఫోనులో పిలిచి తమర్ని రాగానే పంపించమన్నారు. తలబాధ ఎక్కువగా ఉందట.

ఉంటుందిలే...

తమ రక్కణ్ణించే ఒస్తున్నారేమిటి బాబూ!

లేదుగాని నాకు తెలుసునులే. మరి నేను ఇప్పుడీబండిలో వెళ్తున్నాను.

ఆదారిని ఆయమ్మ యింటికెళ్ళిమసి ఎళ్తారా బాబూ?

నీ తెలివి తెల్లవారినట్లే ఉందిగాని, ముందు జాగ్రత్తగా విను. రేపు ఉదయం ఆవిడఇంటికి వెళ్ళి బాబుగారిని ఆ వచ్చిన స్నేహితుడు బలవంతంచేస్తే, బయలుదేరివెళ్లేరని, రేపులేదు ఎల్లుండి సాయంత్రానికి వస్తానన్నారనీ చెప్పు. ఎక్కడికి వెళ్లేరో మాత్రం నీకు తెలియదు, తెలిసిందా?

ఏటో బాబూ, నాకంతా ఇచ్చిత్రంగా ఉంది. ఇందాకా, ఎవరూ లేందే ఉన్నారంటే తమాషా చేస్తున్నా రనుకొన్నాను. ఇప్పటి కిప్పుడీ పయనమేమిటి? అందులోనూ ఒక్కరే ఉండి, ఇద్దరని చెప్పడ మేమిటి?

అబ్బ, నువ్వు ప్లీడరీచేసిఉంటే సాక్షుల ప్రాణాలను తీసి ఉందువు. ఎందుకయితేనేమి నాకిప్పుడిలా బుద్ధిపుట్టింది, నేను వెళ్తున్నాను, నాయిష్టం ప్రకారము. మధ్యను నువ్వెవడివి నన్ను అడగడానికి?

అదికాదు బాబూ! ఆయమ్మ తలపోటుతో ఎంత బాధపడుతూందో? అప్పుడు తమజబ్బులో రాత్రనక పగలనక ఆయమ్మ ఎంత అవస్థపడ్డాది బాబూ! అయితే తమరటు వెళ్ళకుండానే రెయిలుకెళ్ళి పోతారన్న మాట? పోనీ, నన్నెళ్ళమంటారా బాబూ?

నీక్కావాలంటే వెళ్ళు, నా అభ్యంతరంలేదు, కాని, ఎందుకు నువ్వెళ్ళడం?

ఎందుకేమిటిబాబూ! బాధపడుతున్నవోరికి సాయం చెయ్యడానికి డాక్టరుగారిని పిలుచుకు రమ్మంటారేమో?

ఆమాత్రం పని చెయ్యడానికి ఆవిడకి ఎవరూ నౌఖర్లు చాకర్లు లేరనుకొన్నావా? నువ్వు అక్కడికి వెళ్తే ఇక్కడ ఉద్యోగం ఊడినట్టే. నువ్వు మరేమీ అతితెలివి వినియోగించకుండా నేచెప్పినట్టు చెయ్యి: ఒకవేళ ఆవిడ ఇప్పుడే రైలువెళ్ళేలోపున అడిగితే స్నేహితుణ్ణి దిగబెట్టడానికి స్టేషనుకి వెళ్ళేరనీ అటునించి తమయింటికే వెళ్తున్నారనీ చెప్పాలి. నువ్వులే. నువ్వీ బట్టలూ అవీ సర్దడం మొదలుపెడితే ఈబండికి కాదు, పన్నెండు గంటల బండీకికూడా తెమలదు. తొందరగా పరుగెత్తివెళ్ళి జట్కా తీసుకురా?

చిత్తంబాబూ!

కూర్మయ్యని అన్నాడేగాని, అతను జట్కా తీసుకొని వచ్చేసరికి అలాగే కూర్చుని ఉన్నాడు నీలకంఠం. నాలుగు పెట్టెలలోనివీ బట్టలు చుట్టూ విరజిమ్మి ఉన్నాయి. ఎదురుగాఉన్న సూట్ కేసు

ఖాళీగా ఉంది. వెలిగించిన సిగరెట్టు దానంతట అది కాలి చివరకు చెయ్యి చురికితే నే గాని పారెయ్యాలని స్ఫురించలేదు.

చెయ్యి చురికిందని చికాకుపడుతూ ఉండగా 'జట్కా వచ్చింది బాబూ' అన్నాడు కూర్మయ్య.

నీమొహం వచ్చింది. ఎందుకు జట్కా! ఇప్పుడింత హఠాత్తుగా పారిపోవలసిన అవసరం నాకేం పట్టింది! నేనే తెమ్మంటే మాత్రం చెప్పిన ప్రతిపని వెంటనే చేసి ఏడిసేవా? సరే వాడికి ఏనో కొన్ని డబ్బు లిచ్చిపొమ్మను.

వాడిని పంపించివచ్చి కూర్మయ్య బట్టలు తీసి పెట్టెలలో సర్దసాగాడు. ఇదంతా నీలకంఠం చూస్తున్నాడంటే చూస్తున్నాడు; లేదంటే లేదు. కొద్ది క్షణాలు పరధ్యానంగా కూర్చొని, చివాలున లేచి, "అయితే ఆ జట్కాని పంపించేసేవు కదూ" అన్నాడు.

చిత్తం బాబూ, తమరు చెప్పినవెంటనే పంపించేసినాను.

నాకు తెలీదూ. నీ తెలివితేటలూ—హుం అక్కరలేని పనులు మాత్రం ఇంకా నా నోట్లో మాట నోట్లో ఉండగానే చేసి తగలెడతావు. ఆ సైకిలు కూడా వేళకి పనికిరాకుండా పోయింది.

తమరు తొక్కడం లేదుకదా అని బాగు చేయించలేదు బాబూ! కావాలంటే ఎంత! జట్కా నిమిట్లలో తెచ్చేస్తాను.

అక్కర్లేదులే.

అయినా ఏటో బాబూ! తెస్తే ఒద్దంటారు. పంపించేస్తే కావాలంటారు. తమరి ఒంట్లో ఎలా ఉందో? ఎక్కడికీ తిరగకుండా చల్లగా పడుకోండి బాబయ్యా! కాళ్ళు పిసుకుతాను. నిద్రపోతే అంతా అదే సర్దుకొంటుంది.

నిద్రపోతే అంతా అదే సర్దుకొంటుంది - నిద్రపోతేను. కాని, నిద్రపోవడ మెలాగ? అసలు టైమెంతయిందో చూడు.

టైమా, ఏటిబాబూ! తమచేతినే, వాచీ ఉండగా నన్నడుగుతారు? తమకి సుస్తీగా ఉంది బాబూ పడుకోండి.

వెధవ ఉపన్యాసమూ నువ్వూను. నా వాచీ నడుస్తున్నదో ఆగిపోయిందో—నీకేం తెలుసును, చెప్పగానే హాల్లోకి వెళ్ళి టైముచూసి రారాదూ? అడ్డదిడ్డమైన వెధవసమాధానాలు చెప్పకపోతే...

తొమ్మిదికి అయిదునిమిషాలుంది బాబూ!

సరే, ఇప్పటికి మహా గొప్ప విషయం కనిపెట్టేవులే. నేను వెళ్తున్నాను.

ఎక్కడికి, రైలుకేనా బాబూ!

ఆ సొదంతా నీకెందుకు? ఎన్నివేలమార్లు చెప్పేను, వీధిలోకి బయలుదేరేముందు ఎక్కడికని ఎప్పుడు తిరిగివస్తారని అడగవద్దని...

కాదు బాబూ! మళ్ళీ యింటికి వస్తామంటే పక్క అంతా సర్ది ఉంచుతాను. రాకపోతే, పాలు ఇప్పుడే తాగేసి వెళ్ళండి. భోజనం సరిగా చేసేరో లేదో?

నీలాటి నౌఖరున్న తరవాత మరి తిండి తిన్నగా తినడం అంటూ ఉంటుందేమిటి? నా బసకు నేను రావడానికీ పోవడానికీ కూడా మధ్యను నీ పెత్తనమేమిటి? వస్తే వస్తాను, లేకపోతే లేదు. నాయిష్టం. నీచేతనయినపని చెయ్యి, లేకపోతే మానీ. తాళం వేసుకొని చక్కాపో...ఏది నాతాళం. పర్సులో ఎక్కడా కనబడదు. ఎక్కడ తగలెట్టావో?

నాకేమి తెలుసును బాబూ: తమరి తాళం తమ దగ్గరే ఉండాలి ఎక్కడ పోయిందో?

పోతేపోనీ బాబూ! తమరెళ్ళండి. తమరు తిరిగొచ్చేదాకా నేనెక్కడికీ కదలను. అయినా ఒంట్లో బాగులేదు కాబోలు. ఎందుకెళ్తారు బాబూ పడుకో కూడదా?

తిన్నగా నోరు మూసుకొని పడివుండక వెధవ మాటలూ నువ్వూను.

కూర్మయ్యమీద కోపంతో కొంతమేర చరచరా నడిచివెళ్ళేడు నీలకంఠం. నిజంగానే కూర్మయ్య చెప్పినట్లు తన వంట్లో బాగులేదేమో? లేక తన మనసు సరిగా పనిచేస్తూ ఉందో లేదో?

లేకపోతే ఇంత ఆలోచన తటపటాయింపు దేనికి? తనకేం కొత్తా, మొగమాటమా? ఆప్తమిత్రుడు రాధాకృష్ణయింటికి వెళ్ళడాని కింత సంకోచం దేనికి.

అతనికి తెలియకుండానే నడక చాలా మందగించి పోయింది.

ఇప్పుడు తాను కేవలం ఆప్తమిత్రుడుగానే రాధాకృష్ణ ఇంటికి వెళ్తున్నాడా? ఇంతకీ అతను ఇంట్లోనేకాదు, ఊళ్ళోనూ లేడని తెలుసునుకద!

అయితేమాత్రం, లోగడ ఎన్నిమార్లు రాధాకృష్ణ ఇంట్లో లేని సమయాల్లో తాను నిర్మలా దేవితో కబుర్లు చెప్తూ కూర్చోలేదూ. ఎన్నిమార్లు, తామిద్దరే, కలిసి సినీమాకి వెళ్ళలేదు. అంతకంటె ఇప్పుడున్న విశేష మేమిటి?

ఏ విశేషమూ లేకపోతే ఇప్పుడింత తటపటాయించవలసిన అవసరం ఏం వచ్చింది?

ఏమిటిది ఈ అడుగుల చప్పుడు? సరిగా నాతోనే ఎవరో నడుస్తున్నట్టున్నారు. ఊహుఁ ఎవరూ లేరే. తన పదధ్వని తనకే వింతగా వినిపిస్తోంది కాబోలు. దొంగతనం చెయ్యబోయ్యేవాడు తన నీడని చూసి తానే భయపడతాడంటే ఇదే అయి ఉంటుంది.

ఇందులో దొంగతనానికీ భయానికీ ఏముంది?

ఆవిడకు ఒంటరిగా ఉండడంవల్ల ఏమీ తోచడంలేదు; పైగా తలనొప్పిగా ఉంది. అటువంటి స్థితిలో కాస్త కాలక్షేపంగా ఉంటుందని రమ్మంది. కలిసి సినీమాకి వెళ్ళడమో, ఏవో కబుర్లు చెప్పడమో సాగిస్తారు. ఇంతమాత్రంలో ఎవరికి ఏమి హాని చేసినట్టవుతుంది? అప్పుడు తన జ్వరంలో ఆవిడ రాత్రింబగళ్లు ఎంతలా సేవ చేసిందికాదు. ఇదివరకల్లా లేని తప్పు ఇప్పుడేనా వచ్చింది? తనవన్నీ వట్టి ఆధారంలేని అనుమానాలు.

మళ్ళీ నడకవేగాన్ని అందుకొంది. కాని హఠాత్తుగా ఆగిపోయేడు, మళ్ళీ ఏదో తనను అనుసరిస్తున్న పదధ్వనిలా వినిపించింది. ఆగినతరవాత ఏ చప్పుడూ లేదు. ఎవరా గోడప్రక్కను మనిషి? ఎవరో ముష్టివాడు కాబోలు. ఇప్పుడు నేను వచ్చినప్పుడక్కడ ఉన్నాడా? ఏమో సరిగా చూడలేదు. లేక, తన ఈ నడక, ఈ గాభరా ఈ వైఖరి అంతా చూసి, ఏ పోలీసు ఉద్యోగి అయినా వెంటాడుతున్నాడేమో? ఇదీ చిత్రంగానే ఉంది. చూసి చూసి, నిన్ను ఎరస్టు చేస్తున్నాను పద పోలీసు స్టేషనుకి అంటే?

అంటే అననీ, ఏం భయం? మహారాజులా వెళ్తాడు. ఈ రాత్రిమటుకు స్వేచ్ఛ లేకపోతేనే బాగుంటుంది. రేపు సాయంకాలానికి రాధాకృష్ణ వస్తాడేమో? హుఁ తనని హింసించాలని కాకపోతే, నిర్మలనుకూడా తీసుకొని పోకూడదూ?

అతనికేం తెలుసును, తన మనసు యిటువంటిదని—తానింతటి స్నేహద్రోహిఅనిన్నీ - తానీరకం మనిషి అని తెలిసిఉంటే, అసలు చేరనిచ్చేవాడే కాడేమో? మొదట్లో జీవితమంటే విసుగ్గా సంఘమంటే బెదురుగా, ఒంటరిగా అడవులూ కొండలూ పట్టుకొని తిరుగుతున్నవాడికి జీవితంలోని మాధుర్యమేమిటో రుచి చూపించాలని ప్రయత్నించేడు, తన పాటులు కూడా అశ్రద్ధచేసుకొని—అదే అతడు చేసిన నేరం.

అటువంటి ప్రేమపాత్రుడయిన స్నేహితుడికి తానుచేసే ప్రత్యుపకృతి అతని భార్యను కోరడం. ఛఛఛ. ఇంతకంటె నీచమయిన మిత్రద్రోహం ఇంకెక్కడుంటుంది. ఇంతకంటె ఆత్మహత్య నెయ్యిరెట్లు నయం—తక్కున ఆగిపోయేడు, వెనుకనుండి వచ్చే పదధ్వనికూడా ఆగిపోయింది. కాని ఉండాలేదా అని అనుమానంగా ఉండే ప్రతిధ్వని మాట ఆగిన కొంచెంసేపటిలో ఆగినట్టయింది. అది నిజం కావచ్చు, తనభ్రమ కావచ్చును.

అబ్బబ్బ! తాను ఒకమూల అటో ఇటో తేల్చుకోవలసిన ముఖ్య సమస్య గురించి కొట్టుకుచస్తూ మధ్యలో ఏవో నీడలు వెన్నంటివస్తున్నాయనీ, ఏవో పదధ్వనులు వినిపిస్తున్నట్టున్నాయనీ అనుమానపడుతూ కూర్చుంటే ఎలాగ?

ఇలా నడుస్తూ ఆలోచిస్తే లాభం లేదు. ఎక్కడో ఒకచోట ఒక్క రెండునిమిషాలు నిశ్చలంగా కూర్చొని, నిదానంగా ఆలోచించి అటో ఇటో ఏదో ఒక తిరుగులేని నిశ్చయానికి రావాలి. ఎక్కడిదాకానో ఎందుకు? ఇక్కడే, ఎవరిఇల్లో గాని, ఈ అరుగు ఎత్తుగా చాలా బాగానేఉంది; వీధికూడా నిర్మానుష్యంగానే ఉంది.

తగినంత చీకటి లేక రేడియండయాలు వాచీముళ్ళు కనిపించీ కనిపించనట్టున్నాయి. ఒక గబ్బిలం ముంజూరు దగ్గరనుండి బైటపడి, టపటపమని కొంతసేపు కొట్టుకొని ఎగిరిపోయింది; ఊరకుక్క ఒకటి లేచి టపటపమని చెవులు కొట్టుకొని, ఏదో పెద్ద పని ఉన్నట్టు పరుగెత్తసాగింది. ఇందాకటి ముష్టివాడు అలాగే గోడవారనే ఉన్నాడు. బహుశః ముష్టివాడు కాడేమో? ఎవడయితేనేం వాడి ఉద్దేశం నేను తనను గమనించలేదని అయిఉంటుంది—ఎవడయినా మనకొక్కటే—ఇందాకా ఎగిరిన ఒక్క గబ్బిలమే కాదు ఇంకా ఉన్నాయి కాబోలు, కంపు కొడుతూంది; అందుకు పల్లమెరుగని నీరు నిలవయిన మురుగుకాలవ సౌగంధ్యం కూడాను.

సంశయాత్మా వినశ్యతి అన్నారు, మరి సందేహించడం వట్టి తెలివితక్కువ—సరిగా ఇందాకా వస్తానన్న టైముకూడా అయింది. మామూలుగా వెళ్తాము, ఆవిడ సినీమాకి వెళ్దామంటే వెళ్తాము, లేదా కబుర్లు చెప్పుకొంటాము, కాదంటే ఆవిడకు నిద్ర వచ్చే పర్యంతం ఏదయినా పుస్తకం పైకి చదువుతాము. ఇందులో పొరపాటెక్కడుంది? తన మనస్సెలా గుంటేనేమి? ఒక్క చేతితో తట్టినంతలో చప్పుడు కాదుకదా? ఇంతకీ ఆవిడ ఈసరికి నిద్రపోతూ ఉంటే ఏ గొడవా లేదు. తిన్నగా తానూ ఇంటికి పోయి పడుకొంటాడు.

చకచక నడక సాగించాడు. ఇందాకటి నీడలూ పదధ్వనులూ ఏమీ గోచరించలేదు. అంటే అదంతా తన భ్రాంతి మాత్రమే నన్నమాట.

ఇంటిముందు తోటలోని చెట్ల సందుల్లోంచి కనిపిస్తుంది దీపం. అనుమానం లేదు. అదుగో రెండవ అంతస్థు. ఆమెగదే. బహుశః కిటికీ దగ్గరే ఉండి ఉంటుంది. మరి కొద్ది అడుగులు వేస్తే కనబడిపోతాడు. స్పష్టంగా ఫలానా అని తెలియకపోయినా, ఒడ్డు పొడుగులనుబట్టి, నడకనుబట్టి ఆవిడ పోల్చుకోగలదు. కంటబడి వెనక్కి మరి తిరిగిపోవడం పురుషలక్షణం కాదు.

అయితే ఇలా దొంగతనంగా పారిపోవడం మాత్రం పురుషలక్షణమా. ఏమో, తల పగలకొట్టుకొన్నా తేలకుండా ఉంది.

ఏమిటీ చిత్రం, తననెవరూ బంధించి ఉంచలేదే—తాడుకట్టి ఇక్కడకు ఈడ్చుకొని రాలేదే. అయినా ఏదో అదృశ్యశక్తి తనను బలవంతంగా లాగుతున్నట్టే ఉంది. రైలెక్కి దూరంగా ఎక్కడికో పోవాలనుకొన్నవాడు ఉండిపోడం దేనికి? ఉన్నా ఇంట్లో పడుకోక ఇలా బయలుదేరడమేమిటి? బయలుదేరినవాడు ధారాళంగా వెళ్ళక మధ్యలో ఇన్నిమార్లు ఆగడం, 'మనమా వద్దిక నాదుమాట వినుమా మర్యాదగాపాడుమా' అన్న శ్రవణానందం ధోరణిని తర్జన భర్జనలు చెయ్యడం ఏమిటి?

మరేం అనుమానం లేదు, తన మనస్సు పూర్తిగా చెడిపోయింది. లేకపోతే రాధాకృష్ణ ఒంటరిగా ఊరికి వెళ్తున్నాననగానే ఏదో చెప్పలేని ఉత్సాహం ఎందుకు కలగాలి? ఆ తరవాతయినా, ఒకవంక తప్పించుకొందికి ప్రయత్నిస్తున్నట్లు ఉండికూడా ఎందుకు దూరంగా పారిపోకపోవాలి? ఆమె తనకు కావాలి, లేకపోతే మరి బ్రతకలేదు, తనను ఒకటవ రకం మిత్రద్రోహి అని లోకం దుమ్మెత్తినా సరే.

ఇది కేవలం తనలోపమే కాదు. ఇటీవలి ఆమె చర్యలోనూ తనలోని ఈ రకమయిన వాంఛను రేకెత్తించే గుణాలెన్నో ఉన్నాయి. ఆమె నవ్వులో మునపటికీ ఇప్పటికీ చాలా భేదం ఉంది; మాటలో, నడకలో ఎవరూ లేనప్పుడు మరిచిపోయినట్టుగా చెయ్యి పట్టుకోవడంలో... ఊహుఁహుఁ ఎటువంటి అనుమానం లేదు; తన మనస్సుకంటె స్పష్టంగా తెలుస్తుంది ఆవిడమనస్సు. ఇందాకా ఫోనులో వినిపించిన గొంతుకలో కూడా ఎటువంటి సందేహచ్ఛాయా లేదు. ఆవిడ సహజంగా ఎంతో మంచిది కానీ, ఇదేదో ఆవిడబలానికి కూడా మించిన అదృశ్యశక్తి లాగడం వల్లనే కావచ్చును, పక్కదారిలోకి లాగుకొనపోబడుతూంది. అంతా పూర్తిగా తనలాగే. లోగడ తానెందరు ఎంతటి సౌందర్యవతులను చూడలేదు, అప్పుడెల్లా చలించనిమనసు, వట్టి చలించడం కాదు, బలవంతంగా ముక్కుకు తాడుకట్టి లాగుకొని పోయినట్లుగా ఈడ్చుకొని పోతూ ఉంటే—మరి నిలవడమెలా సాధ్యమువుతుంది?

హుఁ ఆగు, చూడు, మరిరెండడుగులు ముందుకు వేసేవా? మరి జన్మలో ఎన్నటికీ నిన్ను నువ్వు క్షమించుకోలేని నైచ్యానికీ మిత్రద్రోహానికీ సిద్ధపడుతున్నావన్నమాట, చూసుకో, ఆవిడ ఏదో నిన్ను కావాలంటే మాత్రం అతనిని విడిచిపెట్టేస్తుందా? విడిచిపెట్టాలంటే మాత్రం వీలుండొద్దూ? వాటన్నిటిమాటకీ ఏమి? ముందు మిత్రద్రోహానికి సిద్ధపడితే తక్కినవన్నీ తరవాత తేలవలసిన చిన్నచిన్న సమస్యలు. ఇంతటి సంశయాత్మకమయిన స్థితిలో ఏమి సుఖముంటుంది? అనవసరంగా శాశ్వతమయిన అపనిందపడడమే మిగిలిపోతుంది—కేవలం తలచుకొన్నంతమాత్రాన ఆమె చేతు లింత మెత్తగా సుదృఢంగా బంధించగలుగుతున్నాయికదా! దగ్గరకు వెళ్ళేక మరి నిగ్రహించుకోవడమున్నది కల్ల.

సరే మరెందుకిన్నిమాటలు, ఇది వట్టి దాంభికత్వంకానీ, నటనకానీ, ఆత్మవంచనేకానీ మిత్రద్రోహంకంటె వెయ్యిరెట్లు నయం. కేవలం దొంగలాగ కనబడకుండా ఓడిపోడమూ ఓడిపోయినట్టే అవుతుంది—రేపు ఉదయం వచ్చి నాలుగు సంగతులూ నిర్మొగమాటంగా చర్చించి, మరి ఎన్నడూ వారి జీవితక్షేత్రంలోనే కాదు, ఏదంపతుల జీవితప్రాంగణంలోనూ అడుగు పెట్టకూడదని నిశ్చయించుకొన్నానని

చెప్పి శెలవు తీసుకొనిపోవాలి. అదీ అసలు సక్రమమయిన కర్తవ్యం. దానిని లోకంతోపాటు తన మనస్సుకూడా నైతికమయిన నిగ్రహశక్తిఅననీ, అపౌరుషమయిన దౌర్బల్యమూ ఆత్మవంచనా అననీ— దానివలన కలిగే బాధ ఏదో తన ఒక్కడికేతప్ప ఇతరులను హింసించదు.

తిరుగుముఖంపట్టి ఇందాకటికంటె చరచరా నడక సాగించేడు. మళ్ళీ ఆ అరుగు కనిపించేసరికల్లా నడక తనంతట ఆగిపోయింది. ఇదేకాబోలు అలవాటులోని ప్రభావం అనుకొంటూ కూర్చున్నాడు.

ఎక్కువసేపు కూర్చోలేదు. లేచేడు. లేచి నడక సాగించేడు. అటూఇటూ, ఇటూఅటూ, ఎటూ కాకుండా మధ్యను నిలబడుతూ ఏదయినా అరుగుమీద కూర్చుంటూ నడుస్తూ...

మధ్యమధ్యలో తనకు పిచ్చెత్తిందా, తాను ఏమిటి చెయ్యబోతున్నాడు ఎటువెళ్ళబోతున్నాడు. అని అనుమానాలు వచ్చేవి. పది పదిహేను గజాలు మాత్రమే నడిచికూడా వెనక్కి తిరిగి పోతూఉండేవాడు.

చిట్టచివరకు పన్నెండుగంటల ప్రాంతంలో ఎవరోవెంట తగుల్తూఉంటే ప్రాణభయంతో పరుగెత్తినట్టుగా రొజుకొంటూ రొప్పుకొంటూ ఇంట్లో ప్రవేశించాడు. గాభరాతో కూర్మయ్యానోట కొంతసేపు మాటరాలేదు. అతడు సర్దుకొని మాట్లాడబోతూ ఉండగా—. "నువ్వు మరేమీ వాగకుండా నేను చెప్పినది విను. నాకు మరేమీ వంట్లో చికాగ్గాలేదు. నువ్వేమీ గాభరాపడి ఎవర్నీ పిలవనక్కరలేదు. నేను హాయిగా నిద్రపోగలను, వెధవమాత్రలు, మరొక పదో పదిహేనో ఉంటే, నిర్విచారంగా హాయిగా శాశ్వతంగా నిద్రపట్టేసునుకదా! అప్పుడు భయంకొద్దీ రెండే తెచ్చేను. సరే, నువ్వు చెయ్యవలసిందేమిటో నీకు తెలిసిందా? ఇదిగో ఈగది అవతల గొళ్ళెంపెట్టి తాళంవేసి, తక్కిన తలుపులన్నీ వేసుకొని, వీధితాళం వేసుకొని గుమ్మంలో పడుకో. నేను ఎంతపిలిచినా సరే, ఉదయం ఎనిమిది గంటలలోగా తియ్యకు. ఊఁహుఁ వద్దు. ఉంటే పిలిస్తే తియ్యకుండా ఉండలేవు - తాళం వేసుకొని మీవాళ్ళింటికి పో...

ఏమిటో బాబూ అంతా ఇచ్చిత్రంగా ఉంది. డాకటరుగారిని పిలుద్దునా? పోనీ నిర్మలమ్మగారికి ఫోనుచేస్తే...

ఒరేయి కూర్మయ్యా! మరి నువ్వు నా చిన్నతనంనుంచి ఉన్న నౌఖరువని దయచూడను. నీకు బ్రతకాలని ఆశఉంటే, నీస్వంతపైత్యం ఏమీ వెలిగించకుండా చెప్పినట్టు తాళాలు వేసుకొనిపో... ఊఁ వెళ్ళు, చాలు, మరేమీ సర్దుబాటు అక్కరలేదు. నీళ్ళున్నాయిసరే—వెళ్ళు—తాళం వెయ్యి ముందు. తక్కినతాళాలన్నీ వేసుకొనిపో—జాగ్రత్త, ఎవరినయినా పిలిచేవంటే చూసుకో—మళ్ళీ ఉదయం ఎనిమిదిగంటలకే.

అమ్మయ్య, ఇక నిర్విచారంగా, నిర్బంధంగా నిద్రపోవచ్చును. ఇంతసులభంగా తేలిపోయేదానికి అనవసరంగా ఎంత బాధపడ్డాను.

ఉదయం మెలకువవచ్చి చూసుకొనేసరికి చేతివాచీలో ఏడున్నరయింది. కాని తనకుమాత్రం ఒకగంటకంటె ఎక్కువసేపు నిద్రపోయినట్టు లేదు. పరధ్యానంగా లేచివెళ్ళి తలుపు తెరవబోతే అవతల గొళ్ళెం పెట్టి ఉంది. ఏమిటి? ఎవరిలా గొళ్ళెం పెట్టేరని అనుకుంటూఉండగా స్ఫురించింది. రాత్రి తానే కూర్మయ్యకు అలా చెప్పిన సంగతి—ఒక్కమారుగా రాత్రి తన డోలాయమానస్థితి అంతా మనసులో మెరిసింది. సరే, ఎనిమిదంటే ఎనిమిదివరకూ రాడు కాబోలు ననుకొంటూ వెళ్లి మంచంమీద పడుకొన్నాడు.

మళ్ళీ చిన్న కునుకు పడుతూఉండగా మెత్తని తీయని కరస్పర్శతో మెలకువ వచ్చింది. కళ్ళు విప్పకుండానే తెలిసిపోయింది నిర్మలాదేవేనని.

ఏం, వంట్లో ఎలాఉంది?

బాగానే ఉంది; కాని మీ కెలా తెలిసింది, మా కూర్మయ్యేనా? వాడి కెలాగూ ఇవాళ బర్తరఫు తప్పదు. అయితే అదీ ఒకవిధంగా పనికి వచ్చింది. నేనింకా ఇప్పుడే మీదగ్గరకు వచ్చి, వెనకటిలాగ నా దేశసంచార కార్యక్రమం సాగించాలని నిశ్చయించుకొన్నానని చెప్పి, శెలవు పుచ్చుకోవాలనుకొన్నాను.

నాకేమీ బోధపడడంలేదు. నిజంగానే మీకు వంట్లోనో మనస్సులోనో లేక రెంటిలోనూ బాగులేదేమో? ఒళ్ళుకూడా మామూలుకంటె వేడిగా ఉన్నట్టుంది. డాక్టరుకి ఫోనుచేస్తాను.

నాకేం చికాకులేదని రుజువు చేసుకొందికి ఏంచెయ్యమంటే అది చేస్తాను—అడుగో వచ్చాడు. ఏం కూర్మయ్యా తెల్లవారకుండా ఆవిణ్ణి నిద్రలేపి తీసుకొని వచ్చేవుకదూ ఉండుండు...

తమచిత్తం, నన్ను చంపేసినా సరే, రాత్రి నాకేమిటో తమర్ని చూస్తే భయంవేసింది బాబూ!

అదేమిటది నీచేతిలోది?

అదేబాబయ్యా, తమకి చూపించాలనే తెచ్చేను. రాయికి ఈ గుడ్డకట్టి కిటికీదగ్గర పడిఉంది.

ఏదేదీ, ఈరుమాలు రాధాకృష్ణది, ఇక్కడి కెలా వచ్చింది.

ఏదీ ఇలా ఇయ్యండి. ఇది రాధాకృష్ణదే నని మీకేం తెలుసును.?

ఆబట్ట నేను కొన్నది, అందిమీద సీతాకోక చిలక నేను కుట్టినది, నాకు తెలియక పోవడమేమిటి? అదుగో అందులో కనబడీ కనబడకుండా రాధాకృష్ణ పేరు కూడా ఉంటుంది. ఇదుగో ఆర్. కె. సరేనా?

సరే, అయితే కిటికీదగ్గరెందుకు పడిఉండాలీ? వట్టి రాయేనా?

లేదు, ఏదో ఉత్తరం ఉంది. ఇదుగో.

నేను చదవలేను మీరే చదవండి నిర్మలాదేవీ! కూర్మయ్యా నువ్వు వెళ్ళి కాస్త కాఫీ అయినా తయారుచెయ్యి. ఊఁ చదవండి.

ఇదేమిటో చిత్రంగా ఉంది ఈ ఉత్తరం ధోరణి—

జయించిన సంశయాత్మునకు నీలకంఠానికి!

నేను ఎక్కువగా రాయనక్కరలేదు. నాకు ఆమెమీద ఉండే మోహంకొద్దీ నేను నిర్మలాదేవిని తప్పనిసరి పరిస్థితులలో ఇరికించి, నాడబ్బు మూలంగా ప్రలోభపెట్టి పెళ్ళి చేసుకొన్నానన్న సంగతి తెలిసి కూడా గుర్తించకపోడానికే ప్రయత్నించేవాణ్ణి. ఆమె కూడా అలాగే ప్రయత్నించేది.

అంతేకాదు—నాకూ ఆమెకూ ప్రధానమయిన లక్ష్యాలలో ఐక్యములేదు. అయినా ఆమె అన్నిటిలోనూ నన్ను తృప్తిపరచడంకోసం నా యిష్టాలే తన యిష్టాలన్నట్లుగా ప్రవర్తించేది.

మరి ఈ సొదంతా ఎందుకు? నేను నిన్ను నిజంగానే జీవితంలోని ఆనందం అనుభవించేలా చేద్దామని ప్రయత్నించాను. అయితే చిట్టచివరికి నా ప్రయత్నానికి సత్ఫలితమే కలిగింది; కాని నేననుకొన్న దానికి విపరీతంగా.

నాలో అసూయ అనేది అంత సులభంగా అంకురించలేదు; కాని, అంకురించినదగ్గరనుండి, ఇంతింతై బ్రహ్మాండమంతయింది. చివరికి నా-నేటి ప్రయాణం కేవలం పరీక్షార్థమే.

రాత్రంతా నువ్వు నడుస్తున్నప్పుడు ఎవరో నిన్ననుసరిస్తున్నట్టు అనుమానిస్తూ ఉండేవాడివికదూ! అది భ్రమ కాదు నిజమే—నేను మీ యిద్దర్నీ పరీక్షించి, కౌగిలింతలో ఉండగా ఒక నాటకీయమయిన ఉపన్యాసం కొట్టి మీ యిద్దర్నీ కాల్చి నన్ను కాల్చేసుకోవాలని రివాల్వరు సిద్ధంచేసుకొని ఉన్నాను.

కాని, అప్పుడే విభాతపు వెలుగురేకలు వస్తున్నాయి; నామనసులోని చీకటికూడా అంతరిస్తూంది.

నేను తిరిగి వచ్చి నా హక్కు స్థిరపరచుకొన్నా మరి నన్ను నిర్మల ఇదివరకులాగయినా ప్రేమించలేదు—నువ్వు ఉన్నా లేకపోయినా ఆమె ప్రేమ నాది కాదు.

నాది కాని ప్రేమకోసం నే నెందుకు తాపత్రయపడాలీ? ఇన్నాళ్ళుగా నువ్వుగడిపిన రకం జీవితమే ప్రస్తుతం వాంఛనీయ మనిపిస్తుంది. ఈ నా నిశ్చయంగురించి, మీ యిద్దరికీ చెప్పి మరీ వెళ్ళాలనుకొన్నాను. కాని, ఏమో తరవాత తరవాత మళ్ళీ మనసు ఎటు ఊగిపోతుందో అని ఇలా రాసి వెళ్ళిపోతున్నాను.

బాంకులో నా పేర ఎక్కువగానే డబ్బుంది. దానిమీద వచ్చే వడ్డీ నెలనెలా జీతంలాగ నాకు మనియార్డరు చేసేలాగ ఏర్పాటుచేస్తున్నాను. అది నాకు చాలును. తక్కిన ఆస్తి అంతా నిర్మల పేరుకే రాసి రిజిష్టరీ చేసి పంపిస్తాను.

నేను నిష్క్రమిస్తున్నాను మీ యిద్దరియెడల ఎటువంటి అసద్భావమూ లేకుండానే—

మనం మళ్ళీ కలుసుకొంటా మనుకోను. కలుసుకొన్నా, శారీరకమయిన ఉద్రేకాలకు అతీతమయిన శాంతిమయమయిన వయస్సులో కలుసుకోవాలని కోరుకొందాము. నాటికి మీసంసారం తామర తంపరగా వృద్ధిచెందడానికి సావకాశం లేకపోలేదు.

స్నేహాన్ని మలినం చేసుకోకుండా నిష్క్రమిస్తున్న నీవాడు, రాధాకృష్ణ.

---